www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి


ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :34 | 07-06-2021 | పుటలు : 4

# ఏయూ జియాలజీ విభాగం నుండి విసి జగన్నాథరావు ఉద్యోగ విరమణ

## మా గురువు... విజ్ఞాన గని



మా గురువర్యుల ఆచార్య మొక్కా జగన్నాథరావు విజ్ఞాన గని. ఎందరో విద్యార్థులకు, అధ్యాపకులకు, విద్యా వేత్తలకు ఆయన మార్గదర్శకం. 24 గంటలు విద్యాపరమైన విజ్ఞాన విషయాలపైన ఆయన ఆలోచిస్తూ ఉంటారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థులు జగన్నాథరావు గారి పర్యవేక్షణలో ఉన్నత విద్యను అభ్యసించి దేశవిదేశాలలో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారు. నేటికీ మేమంతా వాట్సాప్ గ్రూప్ ద్వారా మా అభిప్రాయాలను పంచుకుంటాం.వారి సూచనలు, సలహాలు తీసుకుంటాం. విద్యార్థులమైన మాకు ఆయన గురువు, ఆయన తండ్రి, ఆయన మంచి మిత్రుడు వారి అనుభవాలు మా అందరికీ ఆదర్శనీయం.

-డాక్టర్ వి.పద్మనాభరాజు, అసోసియేట్ ప్రొఫెసర్,ఎమ్.ఆర్.కాలేజ్.

## విద్యార్థులే తొలి ప్రాధాన్యత



ఆచార్య మొక్కా జగన్నాథరావు గారికి విద్యార్థులే తొలి ప్రాధాన్యత. విశ్వవిద్యాలయ ఉపకులపతిగా విద్యార్థుల కోసం నిరంతరం ఆలోచిస్తూ వారి ఉన్న తికి, విశ్వవిద్యాలయ ప్రగతికి పాటు పడుతున్నారు. ఆయన పరి పాలన పరంగా గొప్ప నాయ కుడు. ఆయనలోని నాయకత్వ లక్షణాలు విశ్వ విద్యాలయం అభివృద్ధికి దోహదపడుతున్నాయి. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విద్యా, విజ్ఞాన, పరిపాలన, పరీక్షలు వంటి విషయాలలో సమర్థవంత మైన నిర్ణయాలు తీసుకొని వాటిని అమలు పరుస్తూ క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలిస్తూ ఉంటారు. వారి పర్యవేక్షణలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఆచార్య టి.అశోక్, రిజిస్ట్రార్, నన్నయ విశ్వవిద్యాలయం

## మానవతావాది జగన్నాథరావు




సమాజ హితం కోసం ఆలోచించే గొప్ప మానవతావాది మొక్కా జగన్నాథరావు. ఆయన ఆలోచనలు ఉన్నతంగాను, వారి సేవలు సమాజహితంగాను ఉంటాయి. ఓ.ఎన్.జి.సి వంటి అనేక సంస్థలకు ఆయన సలహా సభ్యునిగా సేవలందించారు. అనేక కమిటీలలో మెంబర్ గా ఉన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యాపరంగా, పరిపాలనపరంగా అధికారాలను చేపట్టి గొప్ప నాయకుడిగా విశేష సేవలందించారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జగన్నాథరావు అభివృద్ధికి ప్రతీక నన్నయవాణి పత్రిక.

- డా.భావన పాపారావు, జనరల్ మేనేజర్(రి)ఓ.ఎన్.జి.సి.




31.05.21 (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ జియాలజీ డిపార్ట్మెంట్ నుండి ఉద్యోగ విరమణ చేశారు. 35 సంవత్సరాలు గురువుగా,పరిశోధక మార్గదర్శకులుగా, విశ్వవిద్యాలయ అధికారిగా ఆయా పదవులు నిర్వహించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విశేష సేవలందించి ఉద్యోగ విరమణ చేస్తున్న జగన్నాథరావును ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయలో రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ మరియు అధికారులు, అధ్యాపకులు సన్మానించి హార్దిక శుభాకాంక్షలను తెలియజేసారు.


ఈసందర్భంగా ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆన్లైన్ లో నిర్వహించారు. జగన్నాథరావు పర్యవేక్షణలో విద్య, పరిశోధన, ఉద్యోగాలు నిర్వహిస్తు దేశవిదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, అభిమానులు, ప్రముఖులు,మిత్రులు ఆన్లైన్ ద్వారా శుభాకాంక్షలను తెలియజేసారు. విద్యావేత్తగా, పరిశోధకునిగా, సీనియర్ జియాలజిస్ట్గా, శాస్త్రవేత్తగా, మానవతావాదిగా,బహుముఖ ప్రజ్ఞాశాలిగా తమతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. గొప్ప వ్యక్తిత్వంతో జగన్నాథరావు అందరికీ సహాయం చేసేవారని విద్యార్థులు కృతజ్ఞతలతో హార్ధిక శుభాకాంక్షలను తెలియజేసారు. విద్యా విజ్ఞానాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని, విద్యార్థులను సొంత పిల్లలుగా భావించేవారని జగన్నాథరావు కుటుంబ సభ్యులు తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తన విద్య, ఉద్యోగాలలో సహకారాన్ని అందిస్తూ తన ఉన్నతికి దోహదపడిన వారందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు. గురువుకు విద్యార్థులే తొలి ప్రాధాన్యమని, విద్యార్థుల ఉన్నతికై గురువు అహర్నిశలు పాటు పడాలన్నదే తన సిద్ధాంతమని అన్నారు. గురువులు పుస్తక పఠనకు, పరిశోధనలకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలన్నారు. తనకు అధ్యాపక వృత్తిపై ఉన్న మక్కువతో సివిల్స్ లో ఎంపికైన దానిని విడిచి గురువుగా స్థిరపడ్డానని చెప్పారు. ఎన్ని పదవులు అధిరోహించిన తరగతి గదిలో పాఠాలు చెప్పిన ఆనందం రాదని నేటి తరం గురువులు దానిని సద్వినియోగం చేసుకోని ఉత్తమ పౌరులను సమాజానికి అందించాలని తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, వీసీగా నియమించిన ముఖ్యమంత్రి గౌరవ జగన్మోహనరెడ్డికి, కులపతి గవర్నర్కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన భార్య డాక్టర్ శాంతి ప్రియ, కుమారుడు సాయి వాత్సల్య, కుమార్తె సంప్రీతి బంధుమిత్రులు,అధ్యాపకులు పరిశోధకులు విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.





## దేశవిదేశాల నుండి ఆన్లైన్ శుభాకాంక్షలు



## బహుముఖ ప్రజ్ఞాశాలి



జియాలజీతో పాటు అన్ని విభాగాలలోనూ అనుభవం ఉన్న గురువు జగన్నాథరావు గారు. మూడున్నర దశాబ్దాలు ఆధ్యాపకునిగా పరిశోధకుడిగా విశేష సేవలందించారు. 33 మంది పరిశోధకులను సమాజానికి అందించారు. విద్య, పరిపాలనలో ఆయనకంటూ ప్రత్యేక స్థానం ఉంటుంది. అనేక అవార్డులు వారిని వరించాయి.తండ్రిగా, భర్తగా, స్నేహితునిగా, గురువుగా పరిశోధకునిగా విద్యార్థిగా అన్నింటికీ ఆయన న్యాయం చేస్తారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించడం ఆయనలోని ప్రత్యేకత. ఉన్నత ఆలోచనలు కలిగిన గురువు మాకు లభించడం మా అదృష్టం.పెద్దలు అభివర్ణించినట్లు ఆయన 'ఆంధ్రా అబ్దుల్ కలాం'

- డా. సిహెచ్.హనుమాన్ ప్రసాద్, సీనియర్ కన్సల్టెంట్ సాఫ్ట్వేర్ ఇండస్ట్రీ

## విజనరీ ప్రొఫెసర్ జగన్నాథరావు



వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు క్రియాశీలక ఆలోచనలతో భారతదేశంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని విద్యాపరమైన ప్రగతిని కోవిడ్ ఆపలేకపోయింది. విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలతో ఆయన వెబినార్లు నిర్వహించారు. వాటిల్లో నేను పాల్గొని కొత్త విషయాలను తెలుసుకున్నాను. అవి సమాజ ప్రయోజనార్థమై ఉన్నాయి. విద్య, విజ్ఞానం, పరిశోధనలు, ప్రాజెక్టులు, ఫండింగ్ రిసోర్స్ వంటి అన్ని అంశాలలో ఆయనకు ఆయనే సాటి. అన్నా విశ్వవిద్యాలయంలో జగన్నాథరావు అందించిన ఉపన్యాసం నేటికీ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంది. జియాలజీలో ఆయన వ్రాసిన పుస్తకం విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. గొప్ప విజన్ ఉన్న ప్రొఫెసర్, వైస్ ఛాన్సర్ ఆంధ్రప్రదేశ్ లో నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తున్న జగన్నాథరావు మాకు మిత్రులు కావడం హర్షణీయం.

- ఆచార్య ఆర్.నాగేంద్ర ప్రొఫెసర్(రి) అన్నా యూనివర్సిటీ.

## సంపాదకీయం



### శిల్పి

మైకేల్ ఏంజిలో ఒక అద్భుత మైన సుందరి ప్రతిమను చెక్కితే... ఇంత అందంగా, అద్భుతంగా ఎలా చెక్కగలిగారని అభిమానులంతా అడిగారు. 'ఏముంది పెద్ద శిల దొరికింది. అందులో ఈ సుందరి నిద్రిస్తున్నది. ఆమె కాక తక్కిన భాగాలన్నింటిని ఆ శిల నుండి తొలగించానంతే!' అన్నాడా శిల్పి.

సాలార్జంగ్ మ్యూజియంలో రెబెకా విగ్రహం చూసినప్పుడు ఆశ్చర్యం నుంచి తేరుకోవడానికి సమయం పడుతుంది. మేలిముసుగులో ఆ సుందరిని శిల్పి ఎలా సృజించగలిగాడని అబ్బురపడతాం. శిల్పి చేతి నైపుణ్యంతో శిల శిల్పంగా ప్రదర్శనశాలలో ప్రత్యేకాంశం అవుతుంది.


మట్టి ముద్దని గొప్ప శిల్పంగా మార్చడానికి శిల్పికి,మట్టికి కూడా ఓర్పు కావాలి. ఈ గడ్డపారతో నన్ను ఎందుకు పొడుస్తున్నావ్.. భరించలేక పోతున్నానని అడిగింది మట్టి. కొంచెం ఓర్చుకో! అన్నాడు. నీళ్లుపోసి పాదాలతో బాగా తొక్కాడు. ఆ మట్టి ముద్దను తీసుకెళ్లి చక్రం మీద పెట్టి గిర్రున తిప్పాడు. కళ్ళు తిరుగుతున్నాయనన్నాను. కొంచెం ఓర్చుకో! అన్నాడు.తయారుచేసి ఎండిన తర్వాత నిప్పుల్లో వేసాడు.కాలిపోతున్నానని,
వొళ్ళు మండిపోతుందనీ గోల పెట్టాను. కొంచెం ఓర్చుకోమన్నాడు. ఒకరోజు రంగులతో ఒళ్లంతా రుద్దాడు.ఏంటిది? అన్నాను.కొంచెం ఓర్చుకోమన్నాడు. గులాబీ రెమ్మల్ని గుండెల్లో గుచ్చాడు. మళ్లీ కొంచెం ఓర్చుకోమన్నాడు. బాధలు పడింది నేను. చాలా అందంగా ఉన్నానని నా గురించి చెబుతూనే సందర్శకులు అంతా శిల్పికి అభినందనలు అందిస్తున్నారు విచిత్రంగా.....

అవును.... ఆ శిల్పం - విద్యార్థి.
శిల్పి - ఉపాధ్యాయుడు.

# అధ్యాపకులను సద్వినియోగం చేసుకోండి

**కళాశాలలకు వీసీ సూచన**

**04.06.21** (మీడియాసెల్) కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులలో అధ్యాపకులను విధులనుండి తొలగించవద్దని, ఆన్లైన్ తరగతుల ద్వారా అధ్యాపకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ తో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆన్లైన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆన్లైన్ సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాలోని అన్ని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, కష్టకాలంలో కూడా ప్రభుత్వం విద్యా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ లబ్ధిని అందుకుంటున్న కళాశాలలు యాజమాన్యాలు విద్యార్థులు దానికి తగిన ప్రతిఫలం విజ్ఞాన రూపంలో సమాజానికి అందించాలని తెలిపారు. ఏ కళాశాల కూడా అధ్యాపకులను తొలగించు వద్దని వారి సేవలను ఆన్లైన్




అనుబంధ కళాశాలల సమీక్షలో మాట్లాడుతున్న వీసీ


తరగతులు రూపంలో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించడంలో కళాశాలలు ముందుండాలని అన్నారు. అధ్యాపకులంతా ఆన్లైన్ పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిం చేందుకు కళాశాలల్లో ప్రత్యేక శ్రద్ధ వహించా లన్నారు. విద్యార్థుల హాజరు, పాఠ్యాంశాల వివరాలు, అసైన్మెంట్లు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్న విద్యార్థులకు ఈ-కంటెంట్ రూపంలో పాఠ్యాంశాలను అందించాలని చెప్పారు. కోవిడ్ జాగ్రత్తలను సూచిస్తూ విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు పారద్రోలి అధ్యాపకులు సైకలాజికల్ కౌన్సిలింగ్ ను అందిస్తు విద్యార్థులకు భరోసాగా నిలవాలని తెలియజేశారు. కేవలం పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా పరిశోధన పత్రాలను తయారుచేయటం, పుస్తకాలు వ్రాయండం మరియు ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి విద్యాపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తుండాలని సూచించారు. విద్యార్థులకు నిత్యం అధ్యాపకులు ఆన్లైన్లో అందుబాటులో ఉండాలని, సందేహాలను నివృత్తి చేస్తూ మంచి విద్యావంతులుగా వారికి మార్గ నిర్దేశం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సిడిసి డీన్ డాక్టర్.ఎం. కమల కుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.పడాల రాజశేఖర్ మరియు ఉభయగోదావరి జిల్లాలలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

# నన్నయలో ఐబిఎం స్కిల్ కోర్సులకు ప్రణాళికలు

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**




**03.06.21** (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ బిజినెస్ మిషన్స్(ఐ.బి.ఎం) వారు స్కిల్ కోర్సుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ మరియు ఐబిఎం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం "ఫ్యూచర్ స్కిల్స్ ఫర్ ఎంప్లోయబిలిటీ" అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. దీనికి కన్వీనర్లుగా స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కిల్ కోర్సులను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఐబిఎం స్కిల్ కోర్సుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దీనిలో ముఖ్యంగా ఇంజనీరింగ్, ఎంసిఏ, బిఎస్సీ కంప్యూటర్స్ మరియు ఎంబీఏ కోర్సుల విద్యార్థులకు తొలిదశగా ఈ కోర్సులను అందుబాటులోనికి తీసుకువస్తామని చెప్పారు. దీనిలో బ్లాక్ చైన్, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్, సాఫ్ట్ స్కిల్స్ వంటి కోర్సులు ఉంటాయని తెలిపారు. క్రమంగా ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎడ్యుకేషన్ కళాశాలల విద్యార్థులకు కూడా తమకు సంబంధించిన నైపుణ్య కోర్సులను అందిస్తామని తెలిపారు. సిలబస్ కు తగినట్టుగా స్కిల్ కోర్సులను రూపొందించాలని సూచించారు. విశ్వవిద్యాలయ పరిధిలోని ఎక్కువ మంది గ్రామీణ నేపథ్యం కలిగిన విద్యార్థులేనని వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తక్కువ ఫీజులతో నాణ్యమైన స్కిల్ కోర్సులను అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐబిఎం మరియు యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ విభాగాలకు వీసీ సూచించారు. రిసోర్స్ పర్సన్స్ ఐబిఎం నుండి డి.అగర్వాల్ లీడర్ - గ్రోత్ ఇనిషియేటివ్స్ కెరీర్ ఎడ్యుకేషన్ ఇండియా, ఆర్.డి మధుసూదనరావు రీజినల్ మేనేజర్ - కెరీర్ ఎడ్యుకేషన్ సాఫ్ట్ వేర్ గ్రూప్ ఇండియా హాజరై స్కిల్ కోర్సులకు సంబంధించిన పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. వారం రోజుల్లో స్కిల్ కోర్సులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, ప్రణాళికలను సిద్ధం చేస్తామని వారు తెలియజేసారు. దీనిలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కన్వీనర్లు స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, ఇంజనీరింగ్ బిఓఎస్ చైర్మన్ డా.బి.కెజియారాణి, బివిరాజు ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.ఐ.ఆర్.కృష్ణంరాజు, ఆదిత్య ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా.సుగుణ మరియు విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



స్వామి భక్తికి, అనంతశక్తికి...
కర్తవ్యనిష్ఠకు, దుష్టశిక్షణకు...
బుద్ధి బలానికి, యశోధైర్యానికి...
ప్రతీక హనుమాన్!!

యత్రయత్ర రఘునాథ కీర్తనమ్!
తత్రతత్ర కృతమస్తకాంజలిమ్!!

హనుమజ్జయంతి
శుభకామనలు!!

- నన్నయ వాణి

## మంచిమాట






## ప్రతిభా వాణి

### శ్రీ కాళీపట్నం రామారావు

(1924-2021)



కారా మాస్టారుగా పసిద్ధి పొందిన కాళీపట్నం రామారావు సరళ భాషా రచయిత, కథకుడు, విమర్శకుడు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఈయన రచనా శైలి సరళంగా ఉంటుంది. ఆయన సామాన్యజ్ఞానం కల పాఠకులను సైతం రచనలో లీనమయ్యేలా, భావప్రాధాన్య రచనలుచేసారు. ప్రసిద్ధ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రామారావు రచనల నుండి ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించేవారు. ఆయన చేసిన రచనలు తక్కువైనా సుప్రసిద్ధాలు. 1966లో ఈయన వ్రాసిన 'యజ్ఞం' కథ తెలుగు పాఠకుల విశేష మన్ననలు పొందింది. దోపిడి స్వరూప స్వభావాలను నగ్నంగా, సరళంగా, సహజంగా, శాస్త్రీయంగా చిత్రీకరించారు. దీనికి 1995 సంవత్సరంలో 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' లభించింది.

కారా మాస్టారుగా పిలువబడే "కాళీపట్నం రామారావు" 1924, నవంబరు 9 న శ్రీకాకుళంలో జన్మించారు. శ్రీకాకుళంలో ఎస్ఎస్ఎల్సి వరకు చదివారు. భీమిలిలో సెకెండరి గ్రేడ్ ట్రయినింగ్ స్కూలులో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. 1943 నుండి 1946 వరకూ నాలుగైదు చోట్ల స్థిరంగా ఇమడగలిగింది మాత్రం ఉపాధ్యాయవృత్తిలో. 1948 నుండి 31 ఏళ్ళు ఒకే ఎయిడెడ్ హైస్కూల్ లో ఒకేస్థాయి ఉద్యోగం. 1972 నుండి నేటివరకు పెన్షనరు గానే జీవితం గడుపుతున్నారు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పదవీవిరమణ చేసారు.

ఆరు దశాబ్దాలుగా కారా మాష్టారి కథలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. తన నిజజీవితంలో అనుభవించిన, పరిశీలించిన కష్టాలను, సంఘర్షణను ఆయన తన కథలలో ఇమిడ్చారు. సమాజంలో అట్టడుగు వర్గాల జీవన సమరాన్ని సునిశితంగా పరిశీలించి తన పాత్రలలో చూపారు. 1964లో వెలువడిన 'యజ్ఞం'కథ ఫ్యూడల్ విధానంలోని దోపిడీని కళ్ళకు కట్టినట్లు చూపుతుంది. అందుకే, ఆయన కథలు ఇతర భారతీయ భాషలలోకి, రష్యన్, ఇంగ్లీషు భాషలలోకి అనువదింపబడి పాఠకుల ఆదరణను చూరగొన్నాయి.

1995 ప్రాంతంలో కేంద్ర సాహిత్య అ కాడమీ అవార్డు ప్రకటించినప్పుడు మాస్టారు సందిగ్ధంలో పడ్డారు. ఆ అవార్డుని తెలుగు కథకి ఉపయోగకరంగా వాడవచ్చు అని చాలామంది ఆత్మీయులిచ్చిన ప్రోత్సాహంతో అవార్డుని స్వీకరించారు. అవార్డుగా వచ్చిన సొమ్ముని మూలధనంగా పెట్టి, కథానిలయానికి పునాది వేశారు. కారామేస్టారి భావనలో కథానిలయం నిజంగా తెలుగు కథకి నిలయం. అక్కడ దొరకని తెలుగు కథ అంటూ ఉండకూడదని ఆయన ఆశయం. ప్రచురితమైన ప్రతి తెలుగు కథా అక్కడ ఉండాలి. కథలతో పాటు కథారచయితల జీవిత విశేషాలు, ఛాయాచిత్రాల సేకరణ కూడాచేపట్టారు.

ఎక్కడెక్కడి పాత పత్రికల కాపీలు సంపాదించడంలో విపరీతంగా శ్రమించారు. కథానిలయం రెండంతస్తుల భవనం శ్రీకాకుళం పట్టణంలో ఉంది.

పదిమందికి సేదతీర్చి, అద్భుతమైన, రసవంతమైన ఫలాల్ని అందరికీ పంచి ఇచ్చి పూల పరీమళాలతో మనసులనాహరించిన తెలుగు కథా వృక్షం.. యజ్ఞం, కుట్ర వంటి కథలు తెలుగువారు చెప్పుకుని గర్వించగల మహాగాథలు.

తెలుగు కథకు చిరునామా కా.రా. ఆంధ్రదేశంలో కథకోసం జీవితాన్ని ముడుపుకట్టిన వ్యక్తి కాళీపట్నం వారే అయి ఉంటారు. వారి ఇల్లే కథానిలయం. వారి హృదయమే కథా మందిరం. కారా మాష్టారంటే యజ్ఞం కథ కాదు. కథా యజ్ఞం!! తపాలా వారి పోస్టుకార్డు వారి చేతుల్లో తన జన్మ ధన్యం చేసుకుంది. ఆయన నుండి కార్డు అందుకోని తెలుగు రచయిత లేడు. కొత్తగా కథాసంపుటి వచ్చిందంటే దానిని కథానిలయానికి పంపించమని కోరుతూ ఉత్తరం వచ్చేసేది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోనే కాదు.. కర్ణాటక, తమిళనాడులో సైతం కథని వెతుక్కుంటూ పర్యటించారు. కథ అంటే ఆయనకు ఆరో ప్రాణం కాదు, మొదటి ఐదు ప్రాణాలు కథ. ఆరోది మాత్రమే ప్రాణం. జీవితమంతా కథాక్షరంగా గడిపి, తనే అక్షరమై, కథా కథనమై, కథానిలయమై, కథలోనే లయమై, కథార్ణవమై బ్రతికిన మనిషి కాళీపట్నం రామారావు గారు.

ఈనెల జూన్ 4న ఆయన పరమపదించడం తెలుగు కథా ప్రపంచానికి తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు ప్రశాంతి కలగాలి. వారికి నన్నయవాణి అక్షర నీరాజనాన్ని అర్పిస్తూ అశ్రునివాళిని తెలియజేస్తోంది.

# పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు పాటుపడదాం

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**




**సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు**

**05.06.21 (మీడియాసెల్)** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు సమష్టిగా పాటుపడదామని, పర్యావరణ పరిరక్షణ మానవాళి అందరి బాధ్యత అని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మీడియా సెల్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ" అనే అంశంపై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. ఈ వెబినార్ కు కన్వీనర్లుగా యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, మీడియా సెల్ కోఆర్డినేటర్ పి.ఆర్.ఓ. పువ్వల ఆనంద్ వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హజరై ఉపన్యసించారు. భూమిపై కొన్ని లక్షల జీవరాశుల తరువాత వచ్చిన మానవుడు అభివృద్ధి పేరుతో పర్యావరణ వినాశనానికి కారకుడు అవుతున్నాడని అన్నారు. కాంక్రీట్ జంగిల్లో, కాలుష్యం కోరల్లో జీవిస్తూ ప్రకృతి విపత్తులను ఎదుర్కొలేక అవస్థలు పాలవుతున్నారని తెలిపారు. ప్రకృతికి విరుద్ధం మానవుల క్రియలు ఇదే క్రమంలో కొనసాగితే భవిష్యత్ అంధకారమవుతుందని చెప్పారు. ఇప్పటికైన మేల్కొని పర్యావరణ హితంగా జీవించాలని, పర్యావరణ పరిరక్షణ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పర్యావరణానికి పెద్దపీట వేస్తుందని విశ్వవిద్యాలయాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటడం, ఇంకుడు గుంటలు త్రవ్వించడం, బొటానికల్ గార్డెన్ ఏర్పాటుకు ప్రణాళికలు రుపొందించడంతో పాటు కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో బయోడైవర్సిటీ పార్క్ అండ్ మ్యూజియం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ శాఖతో ఎం.వో.యూ కుదుర్చుకున్నామని తెలిపారు. పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించే విధంగా విశ్వవిద్యాలయం పని చేస్తుందని అందరూ దీనిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కీలకోపన్యాసకులుగా ప్రముఖ పర్యావరణవేత్త డా.తల్లావజల పతంజలిశాస్త్రి హాజరై ఉపన్యసించారు. కరోనా కారణంగా ఇటీవల మృతి చెందిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సుందర్ లాల్ బహుగుణను స్మరిస్తూ ఆయనకు నివాళులర్పించి ప్రసంగాన్ని ప్రారంభించారు. నదీనదాలను, గిరులను దేవుళ్ళుగా, దేవతలుగా పూజించే భారతదేశంలోనే పర్యావరణానికి ఎక్కువ ముప్పువాటిల్లుతుందని అన్నారు. మానవులకు ఉండే హక్కులు నదులకు కూడా ఉంటాయని న్యూజిలాండ్ వంటి దేశాలు చట్టాలు చేసుకున్నాయని ఆయా దేశాలలోని పర్యావరణ పరిస్థితులను తెలియజేశారు. అర్టికల్ 51ఎ ద్వారా జీవావరణ వ్యవస్థను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. భారతదేశంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన చట్టాలు అధికంగా ఉన్నాయని వాటి అమలు పూర్తి స్థాయిలో జరగడం లేదని తెలిపారు. పర్యావరణ చట్టాలపై అవగాహన పెంచుకుంటు పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు పూనుకోవాలని చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత మనందరిపై ఉందని దీనిలో యువత కీలక పాత్రను పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్, కన్వీనర్లు ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, పి.ఆర్.ఓ పి.ఆనంద్, ఈసీ మెంబర్ ఆచార్య కె.శ్రీరమేష్, అధ్యాపకులు డా.పద్మవతి, డా.తలారి వాసు, డా.శ్రీధర్, స్పృహ అలుమ్ని అసోసియేషన్ సుంకర నాగేంద్రకిషోర్, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

# కరోనా కాలాన సామాన్యుడి జీవితం...



నూతన సృష్టి అని కొందరు, ఆర్థికాభివృద్ధి అని మరికొందరు కొత్త ఒరవడి కోసం ప్రయత్నిస్తూ వారి యొక్క గొప్పను పెంచుకోవడమే తెలిసిన ఈ నూతన యుగానికి సామాన్యుడి జీవితం ఒక అవసరార్థ వస్తువుగా మారిపోయింది. పెరుగుతున్న జనాభాను చూసి మనం దేశ పరపతి, యుగానికి యువశక్తి దేశానికి నవ శక్తి అని ఎన్నో అనుకుంటున్నాం... కానీ నూతన విషయావగాహన లేక ఎందరో సామాన్య కుటుంబాలు కష్ట కాలాలకు చేరువై కుటుంబాన్ని పోషించలేక తెలిసిన పనిని చేయలేక తెలియని పనిలో ప్రతిభను అందుకోలేక ప్రయోగపు జీవిత నావలో ప్రయాణిస్తున్నారు. ఇంతటి దైనందిన జీవితాలను కరోనా అనే మహమ్మారి అతలాకుతలం చేస్తుండగా పుట్టకొకడు, చెట్టుకొకరు అన్నట్టుగా మారిపోయింది.

స్వాతంత్ర్యం సాధించి అర్థశతాబ్దం దాటిన మనకున్న అజ్ఞానాన్ని విజ్ఞానంగా మార్చుకోలేక పోతున్నాం. మన నుంచి వైద్య విజ్ఞానం పొందిన ఇతర దేశాలు ఎంతో ముందంజలో ఉండగా మనం మాత్రం ఇంకా వెనక్కి నెట్టి వేయపడుతున్నాం... ఇటువంటి సంక్షోభ పరిస్థితి అర్థం కాక ప్రభుత్వాల వైఖరి అర్థం కాక సామాన్యుడు తన జీవితపు మనుగడను కొనసాగించలేక జీవితాన్ని అర్థాంతరంగా ముగించిన వేయవలసి వస్తుంది. అదీకాక ఈ మధ్యకాలంలో సామాన్యుడిపై మోపుతున్న అధిక పన్ను భారం,నిత్యావసర వస్తువుల ధరలు ఒక పెట్టు కొరడాలాంటిదని చెప్పవచ్చు. ప్రపంచ స్థాయిలో గొప్ప గొప్పవన్ని ఈ మధ్య కాలంలో ఏర్పాటు చేసినవే కానీ 1974 పంచవర్ష ప్రణాళిక ద్వారా గరీబీ హటావో నినాదంతో పేదరిక నిర్మూలన చేయాలని ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రణాళికలు వేగంగా అమలై సఫలం కావాలన్నదే అందరూ ఎదురుచూస్తున్నది.


సామాన్యులు ప్రభుత్వాల నుంచి కోరుకునేది డబ్బుకాదు

విద్య, వైద్యం, న్యాయం,ఉపాధిని ఉచితంగా అందిస్తే తన పనిని తాను సక్రమంగా నిర్వర్తిస్తూ దేశ ప్రగతిని పెంచగలరు. గతంలో ప్లేగు వ్యాధి విషయంలో ప్రపంచం మొత్తం ఇదే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఇంతటి విజ్ఞానం లేకపోయినా ఎదుర్కొన్నాం. ఇటువంటి సమయాల్లో సామాన్యులు సక్రమమైన వైద్యాన్ని మాత్రమే ప్రభుత్వాల నుండి ఆశిస్తున్నారు. తగిన వైద్య సౌకర్యాలు అన్నిచోట్లా అందిస్తారని ఆశిద్దాం.

**-పి.మణి శేఖర్**
**బి.కాం, బి.ఎడ్ (ద్వితీయ)**

# కవితా కాలం

## కరోనాతో నేను...



కళ్ళు తెరిస్తే కరోనా....
కళ్ళు మూస్తే కరోనా....
కలలో కూడా కరోనా....
కల్లగా ఎప్పుడు మారునో కరోనా.....
ఏ మహానుభావుడో పుణ్యం కట్టుకున్నాడు
లక్షరకాలరక్షణ సూత్రాలు పాటించినా,
చిన్న అలసత్వపు సందులోనుంచి
గప్ చుప్ గా నాకు అంటగట్టాడు కరోనా!
గాలివాటుగా నన్ను వాటేసుకున్న కరోనా!
నేను రాను రానన్న ఊరుకుంటుందా కరోనా!
విశ్వమంతా మహమ్మారి విలయతాండవం చేసి
ప్రళయం సృష్టిస్తున్న వేళ
ప్రాణాలు నీటిబుడగలుగా ఆవిరవుతున్న వేళ
ఏ దేవుడు దిగొస్తాడని ఎదురు చూస్తున్నవేళ
ఆసుపత్రిలో చోటులేక
ఇంట్లోకొంపమునుగుతుందనే
పుకార్లు షికార్ల వార్తల మాయలో
కొడిగట్టిన ప్రాణవాయువు ఊగిసలాటలో
కరోనా కల్లోలం సృష్టిస్తున్న వేళ
గుండెల నిండుగా కొండంత ధైర్యం
నింపుకున్నాను.
యోగవిద్యను ఎక్కుపెట్టాను.
ప్రాణాయామానికి పదును పెట్టాను.
అమ్మలాంటి ఆయుర్వేదాన్ని నమ్ముకున్నాను.
ప్రకృతిపై భారం వేసి పోరాడాను.
ఆత్మసంకల్ప బలం ముందు....
కోవిడ్ భూతం తోకముడిసింది
వారం రోజుల పెనుగులాట తర్వాత గుట్టుగా పట్టు
సడలించి పారిపోయింది.

అనవసర ఆందోళనలు.....
లేనిపోని అపోహలు ప్రచారంచేసే
చచ్చుమీడియాకు చరమ గీతం పాడాలి..
కష్టమైనా, సుఖమైనా స్థిరంగా నిలవాలి
ఒంటి నిండా నమ్మకాన్ని నింపుకొని
వంటిల్లే వైద్యాలయమని చాటాలి!
చైనా విషవైరస్ ను తరిమి కొట్టాలి!!

– డా.కనకరాజు వొలుపు,
తెలుగుశాఖ,
ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఏలేశ్వరం.

## అన్నదాత



కృషీవలుడు
దళారులు దోచుకున్న
నొచ్చుకొని అమాయకుడు.
ధరణి దరహాసం చేసిన
పరిహాసం చేయక
పట్టువదలని విక్రమార్కుడు.
చేతికందిన పంట
వరద మయమైనా,
చినుకు జాడ లేక,
పంట ఎండినా,
చిరునవ్వు చెరగని మహోన్నతుడు
ఆస్తి లేక తను పస్తులున్న,
ప్రపంచ ఆకలిని తీర్చే అన్నదాత,
కరువు కాటకాలు అయినా
కరోనా వేళ అయినా,
తన తల రాత వెక్కిరించిన
తన విధికి బానిసైన రైతన్న భరోసా లేని
బాటసారి.

– బి.భాస్కరరావు,
ప్రకాశం డిగ్రీ కళాశాల, కొయ్యలగూడెం.

## జనఘోష

గాలేమో నిలిచిపోయె
నీరేమో ఎండిపోయె
ఎండేమో మండిపోయె భూమేమో
కమిలిపోయె
మనిషి ఆశ పెరిగిపోయె
ధన దాహం ముదిరిపోయె
వ్యాధి వచ్చి ఊపిరాపె
సూదులేమ్మె కరువాయె
ఇంధనం కరిగిపోయె
కాలుష్యం ముదిరిపోయె
ప్రాణయువు కరువాయె
ప్రజలేమ్మె సాయం కోరె..
నాయకులు తలదాచె..
సోన్సుసూద్ ముందుకొచ్చె
ఆనందయ్య మందు ఇచ్చె
ప్రజలేమో బాధ్యత మరిచే-
బయటికొచ్చి చెలగాటమాడె
రక్షక భటులు ఎండలో నిలిచె-
వైద్యులు తమ ప్రాణాన్నే
పణంగాపెట్టె
అధికారులు నిద్రలే మానె
ఆరోగ్య కార్యకర్తలు ఊరురా
తిరిగె,జనం బాధ వినవయ్యా
కుటుంబాల బాధ చుడవయ్యా..ఓ
నాయకా!!

– వికాస్,
ప్రకాశం కళాశాల.

## మారాలి



నీవుండే ఈగోళం
అగ్నిగోళంగా మారుతున్నా,
స్వేచ్ఛగా ఎగురుతున్న రెక్కలు
రాలిపోతున్నా,
భారతావని మంచుకోటలు
బీటలు వారుతున్నా
నీవు మారవా,
ప్రకృతికి హాని చేయటం
మానవా....
వడగాలులు ఉచకోత కొస్తున్నా,
అకాలవర్షాలు వరదలై ప్రాణాలు
తీస్తున్నా,
కర్బన ఉద్గారాలు కాలసర్పాలై
కాటేస్తున్నా..నీవు మారవా?
నీటి ఊటలు చిరునామా
కోల్పోతున్నా,
కరువు భరువై అన్నదాతలను
కభళిస్తున్నా,
పాడిపంటలు పాడెక్కుతున్నా
నీవు మారావా..
ప్రకృతిని ప్రేమించడం,
రక్షించటం
ఒక్కటైనా చేయవా......

– ఎమ్.చరణ్ సాయి
బిటెక్.సివిల్.

## అక్షర సత్యం

అసత్యం కానిదే అక్షరసత్యం
అదే నవ జీవన విధానం
సమాజ మార్పుకు కరదీపం
ఉద్యమ స్ఫూర్తికి నవగానం
ప్రజా చైతన్యానికి విప్లవ గీతం
నవ సమాజ నిర్మాణానికి
కళ్యాణ రాగం
సత్యానికి పరమపావన కవనం
కదిలించేది..మేల్కొలిపేది..
అదే..అదే..అక్షర సత్యం..!!
ప్రజల తలరాతను మార్చే
ఆయుధం
అసమానతల్ని నేలరాల్చే
ఘంటాపథం
నాలోని నీలోని కలల కార్ఖానాల్ని
సాకారం చేసే కర్మాగారం!
తిమిరాంధకార మార్గాన్ని
తొలగించే వెలుగు మార్గం!
అజ్ఞానాన్ని రూపుమాపే సాధనం.
యువకుల రక్తాన్ని పోటెత్తించే
చైతన్య గీతం.
వృద్ధుల ఆశయాలను సాకారం
చేసే మోక్ష ధామం.
అదే..! అదే..! అక్షర సత్యం..!
క్షరం కాని జీవన వేదం
నిరంతర గమనమే అక్షరసత్యం
లక్ష్యం..!

- డా.పసుపులేటి నాగమల్లిక
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రామచంద్రపురం.

## పర్యావరణానికి వరం - మనిషికి శాపం కరోనా!



"ఉడతను పెంచాను - పారిపోయింది.
చిలుకను పెంచాను - ఎగిరిపోయింది .
మొక్కను పెంచాను - పై రెండు వచ్చి చేరాయి"
ఈ అబ్దుల్ కలాం గారి మాటలు...
గుణపాఠం నేర్పాయి.
మరి, ఓ మనిషి !
చెట్లను కొట్టేశావు - పక్షులకు గూడేది ?
అడవులను మాయం చేశావు-
జంతువులకు నీడేది ?
ప్రగతి అన్నావు - ఫ్యాక్టరీలు పెట్టావు .
అడ్డు అదుపూ లేకుండా
ప్రకృతి వనరుల్ని దోచేశావు.
నియంత్రణ లేని కర్బన ఉద్గారాలు..
గాలి,నీరు,ఆహారం అన్నీ కలుషితాలు...
అకాలవర్షాలు ,వరదలు,
పెరుగుతున్న సముద్ర మట్టాలు.
భూతాపం,కరుగుతున్న మంచు పర్వతం.
కరువు కాటకాలు,భూ కంపాలు,సునామీ.
ప్రకృతిని అతలాకుతలం చేసిన ఫలితం సుమీ !
ప్రస్తుతం ప్రాణ వాయువుకే పెనుముప్పు
,కరోనాతో ఆక్సిజన్ కొరత కనువిప్పు .
ఇప్పుడయితే ,కరోనాకాటు కి మాస్క్ ,
ఎప్పుడో పెట్టాలి వాయు కాలుష్యానికి మాస్క్ .
కరోనా మనిషిని ఇంటిలో బంది చేసింది,
ప్రగతిచక్రం నిలిపి వేసింది .
లాక్డౌన్ పర్యావరణాన్ని ఎలా సంస్కరించింది ?
విమానాలు ఆగాయి,
ఆకాశం తిరిగి నీలమయింది.
పర్యాటకులు లేరు...గంగా, యమున శుభ్రం
అయ్యాయి . పరిశ్రమల వ్యర్థాలు లేవు
ప్రపంచమంతా తేరుకుంది .
మనుష్యుల జోక్యం కానరాలేదు –
జీవులన్నిటికీ స్వేచ్ఛ,పక్షుల కువకువలు ,
నడివీధిలో పురివిప్పిన మయూరం ,
వాకింగ్ చేస్తున్న బాతు పరివారము ,
జపాన్ వీధుల్లో జింకల షికారు
ప్రకృతి అందం కానవచ్చింది .
ఈ భూమి మనిషికే కాదు స్వంతం...
ఎన్నో జీవులతో పంచుకో ఆసాంతం!
భూమాత పాలిట మనిషి ఒక వైరస్.
ఓ యువతా! నీదేరా భవిత!
కంటిరెప్పల కాచుకో ,
పర్యావరణానికి పెను ప్రమాదం కానుకో,
చిత్త శుద్ధితో పర్యావరణాన్ని కాపాడుకో ,
పర్యావరణ ,ధరిత్రి దినోత్సవాలను జరుపుకో!!

– ఉమాజ్యోతి వాసా,హిందీ లెక్చరర్,
ఎస్.కే.ఆర్ కాలేజ్ ,రాజమహేంద్రవరం.

## దిగువ సగటు మనిషి



ప్రకృతి ధర్మంతో స్పందించాలి.
వేసవి సెగలు చల్లబడ్డాయి.
నైరుతి నిశ్శబ్దంగా ప్రవేశించె.
ఆకాశాన అలము కొన్న నీలి మబ్బుల చాటు....
చిరు జల్లులు చిలకరింత...
ధరణి పులకింత.....
రైతన్నకు రవ్వంత ఆశ...
ప్రకృతి ప్రకోపించ కుండా పంటలు పండాలని...
ఏరువాక సాగిన చాళ్ళతో...
పంట పండించడానికి సిద్ధమైన రైతు ఆశాజీవే...
ఆయన ఆశ మన ఆకలి తీర్చింది.
గొంతెండి డొక్క ఈడ్చుకు పోయి...
ప్రకృతిమెుకలు కృషికి నిదర్శనంగా కానవచ్చె...
రైతుకు...ఆయన శ్రమకు రక్షణ కల్పించేదెన్నడు?
ఎన్నటికీ రైతన్న దిగువ సగటు మనిషేనా??

-ఎస్.శ్రుతి, బి.యస్సీ, కొయ్యలగూడెం.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in